# ఊరి అవతలి బావి

'అయ్యో! ఇప్పుడెలా? మంచి తీర్థమంటూ గొంతులో పోసుకుని దాహం తీర్చుకోటానికి గరిటెడు గంగ ఇంట్లో లేదు కదా? అంటూ మంచి నీళ్లకోసం ఆరాట పడుతున్న పెద్దకోడల్ని చూచిన అత్తగారు. రుసరుసలాడుతూ - 'అదేమిటే? మీనాక్షి! కాపరానికొచ్చి ఇన్నేళ్లై, నోటి వెంట సదా ఎల్లప్పుడూ 'లేదు' అనే అవాచ్యపు కూతతక్క మరో మంచి మాట వచ్చి చచ్చిందా? నీకు? అంటూ నిత్యపారాయణం ప్రారంభించింది. 'అది కాదండి అత్తగారు, మీ పెద్దబ్బాయి స్నానం అదీ ముగించుకు సంధ్యావార్చుకోటానికి సిద్ధంగా పూజాగృహంలోకి వెళ్లుతున్నారు. మరి ఆచమనానికి మిల్లిగరిటె మునిగే నీరు స్థాళిలో లేదు, వారికి ఎలా నచ్చచెప్పనూ? అంటూ గాభరాపడిపోతున్నా' అంటూ కోడలు సమాధానం చెప్పింది.

'అయితే? వ్వాళ్లో మిగతా భావులేమయ్యాయ్? మన బావి అంటేనో పాత గేదెలా వొట్టిపోయిందిలే! కొడుకు పొరపాటు, మీ వారి పుణ్యమా అంట, ఆ బావిని స్వయంగా మామగారు మీ మామగారిచేత వెట్టిచాకిరీ చేయించినంత పని చేస్తూ వాళ్ల సతీమణి అదే మా అత్తగారి సౌకర్యార్థం భావిని తవ్వించారు.

' ఆ తల్లిగారి కోసం ఆ మాత్రం చేస్తే తప్పేముందండీ? మీ అబ్బాయి మాత్రం చేయటం లేదూ?

'మాటలు బాగా నేర్చావ్; అంత నోచుకున్నానా? ముగ్గురు మగధీరులకు తల్లిని, ఏం లాభం? ఎంత చెప్పినా పెడచెవిని పెడ్తూ, పూడికా అదీ తీయించక బద్ధకించి జలపూరం లాంటి బావిని కాస్త ఎండించారు.'

'తప్పు ఎవరిదైతే ఏమండీ! ఇప్పుడు ఆపద్ధర్మంగా మరోటి ఆలోచించాలి. గదా? అంటూ పరిష్కారమార్గాన్ని వెతికింది మీనాక్షి.

ఇంతలోకే ఇద్దరు కోడళ్ళూ గబాగబా ఇవతలికొచ్చి సంభాషణలో తమవంతు కలిపారు.

' ఆ అన్నట్లు మరిచాను, అవసరాలకూ, అక్కరకూ, అందరికీ పనికివచ్చే నాల్గు గిలకల బావి నాల్గు దిశలకూ, నాల్గు వేదాలకూ, నాల్గు వర్ణాలకు పనికి వస్తూ చతుర్ముఖ బ్రహ్మకు ప్రతీకగా గుడి వెనకతోటలో వుందిగా! అంటూ సూచించింది నడిపి కోడలు కాత్యాయని..

ఆ మాటలు వింటున్న సరళ వెంటనే అందుకుని 'అక్కగారూ! మీరు పొరపడ్తున్నారు. ఇప్పుడా బావి నాల్గుగిలకల బావి కాదండీ, మూడు చెవుల పిల్లిలా వుంది. పశువుల రాపిడికి నాల్గవ వర్ణం మరింత నల్లబడి పాపం ఆ చెవి నుగ్గూనుసి కాగా చక్రం కాస్త జారి బావిలో పడిపోయింది. అందుకే ఆ బావి ఇప్పుడు మూడు కాలాలకూ, మూడు లోకాలకూ మూడు వర్ణాలకూ ప్రతీక అంటే బావుంటుంది' అంటూ కొంటెగా చూచింది. కాత్యాయనిని వచ్చే నవ్వును రెప్పల్లో దాస్తూ..

'చాల్లెద్దు; నీ వేళాకోళం నీవూను, పాపం! అక్కగారు బావగారిని శాంతింప చేయడానికి లోపలికెళ్లారు; అనవసరమైన పోలికలతో అత్తగారికి కోపం తెప్పించిన వాళ్లమౌతాం' అంటూ గోముగా మందలించింది కాత్యాయని.

'ఇందులో కోపం రావటానికేముంది? చిన్న కోడలు గుణవంతురాలు. కావలసినంత కట్నం పట్టుకొచ్చినా? ఏనాడూ నాకు ఎదురు చెప్పలేదు. సంప్రదాయం అంతా వడబోసి జీర్ణించుకున్న వ్యక్తిలా ఆమె తెలివిగా మాట్లాడింది. అప్రాచ్యపు శబ్దం ఒక్కటీ దొరలలేదు;

అదే ! నీవున్నావ్ చూడు! అగ్నిహోత్రంలాంటి కుటుంబంలో పుట్టావ్ ఏం లాభం? ఏనాడైనా మడి, ఆచారం, వో నోము, వ్రతం, వుపవాసం అంటూ పాటించావా? ఏదీ లేదు. యాంత్రికంగా శ్రమ జీవిలా జీవిస్తూ వాడినీ శ్రామికుణ్ణి చేశావ్',

'నాకు అన్నీ నాన్న గారి పోలికలే వచ్చాయని మా అమ్మగారంటుండే వారండి. ఆ వంశీకుల్లో ఎవరిదో ఒకరి గుణం రాకపోతుందా?

అవునూ? మరి మీరు స్నానం గట్రా ఎలా ముగించుకున్నారు?' అంటూ అత్తగారు ప్రశ్నించారు.

'ఏం లేదండి, ఇందాక, త్రిమూర్త్యాత్మకమై, దత్తాత్రేయ జనని అనసూయలా వున్న ఆ భావికే వెళ్లీ ముగ్గురం మూడు వైపుల చేదలు వేసి నీళ్లు చేది అక్కడే స్నానాలు అవి ముగించుకుని వో బిందెడు మీకూ, మీ అబ్బాయిల కంటూ తెచ్చామండీ!' అంటూ తోటి కోడళ్లిద్దరూ ఒక్కకుతుక్కై సమాధానమిచ్చారు.

'నీటి ఎద్దడి వున్న ఈ రోజుల్లో నాల్గోవైపు గిలకపాడైపోగా, రాత్రి నిశివేళ దొంగచాటుగా మన గిలకలపై చేదవేయటం లేదు కదా? ఏమో? కలికాలం! ప్రతివాడికి

తెలివి ముదిరి, ఏమిటీ ఎందుకూ? అంటూ చొప్పదంటు ప్రశ్నలు గుమ్మరిస్తారు' అంటుండగానే పెద్దకోడలు వచ్చి రాగి చెంబులో నీళ్లు నింపుకుని పాలముక్కలూ, దర్భపోచలూ వేసి పరిశుద్ధపరిచి తీసుకెళ్లింది.

ఇలా వేసవి గడిచిపోయింది.

మళ్లా వేసవి సెలవులొచ్చాయి. పట్టణాలల్లో వుంటున్న ఇద్దరు కొడుకులూ కోడళ్లూ గుసగుస నడిచే బుజ్జిమనమలతో సొంతవూరు నారాయణపురం వచ్చారు. ఆ యిల్లు ఎప్పటిలా అందరికీ స్వాగతం పలికింది.

సూర్యుడు రక్తనేత్రుడై మండిపడుతున్నాడు. వడగాడ్పులు నిప్పులు చెరుగుతున్నాయ్. మేఘాలు గర్జిస్తున్నాయే తప్ప వర్షించడం లేదు; వోటర్లను దళారులు లాక్కెళ్లినట్లు, గాలులు మబ్బులను తేల్చి ఎక్కడికో పంపిస్తున్నాయి. భూమి తడి ఆరి బీటలు వారుతాయేమో? అన్న భయంతో రసాన్నంతటినీ తన లోతట్టున దాచుకుంటూంది. చిన్న చిన్న కుంటలూ, కాలువలూ, పర్రలూ, బావులూ అన్నీ ఎండిపోతున్నాయి.

ఇలాంటి పరిస్థితిలో సంప్రదాయమే వారసత్వంగా, ఆచార పవిత్రతే వూపిరిగా జీవిస్తున్న ఆ కుటుంబానికి నీటి కొరత వో పెద్ద సమస్యగా మారింది.

సుందరమ్మగారి పెద్ద కుమారుడు అంటే మీనాక్షి భర్త రాధాకృష్ణ తల్లి మాట జవదాటని వాడే అయినా బావిలో పూడిక తీయించడంలో తాత్సారం చేశాడు, చేస్తున్నాడు. కారణం అలసత్వం కాదు; నిర్లక్ష్యమూ కాదు; మరి?

రాధాకృష్ణశర్మ ఎంతటి ఆచార పరాయణుడైనా విశాల హృదయుడు, ఎదమెత్తన కలవాడు, మంచి పదార్థాన్ని తానొక్కడే కాదు, అది నల్గురి అవసరాలను తీర్చినప్పడే ఆ వస్తువు కలవాడికి సుఖాన్నిస్తుంది; లేనినాడు పీడగా మారుతుంది. అనే తత్త్వం కలవాడు.

తమ బావిలో నీటికి కొరత వుండదు, పూడిక తీయిస్తే వూరి వారి దాహం తీర్చడానికి సరిపోయే అన్ని నీళ్లు వూరుతాయి; కానీ తన తల్లి సుందరమ్మగారికి 'అంటూ ముట్టూ' అంటూ, కులాల పట్టింపు ఎక్కువ, అగ్రవర్ణం కానివారికి ప్రవేశార్హత వుండదు, తన వారైనా సరే, తరాలనాటి బూజువారిన పద్ధతులే పాటించి తీరాలి. లేనినాడు ఆమె దృష్టిలో భ్రష్టులు, కలిగ్రస్తులు; అలాంటి పరిస్థితిలో తాను భావి పూడిక తీయించి అమృత జలపూరాన్ని తన యింట్లో వుంచుకుని దాహం దాహం అంటూ మురికి నీరు తాగి వ్యాధి గ్రస్తులౌతున్న బడుగు జనాలకు వుపయోగపడకండా అనుభవించడం తనకు చేతగాని పని; అందుకే తల్లిమాట వినలేదు అనే సడికి వోర్చి తటస్థంగా వుంటున్నాడు రాధాకృష్ణ.

ఇప్పుడు ఇంట్లో వాళ్లకు గుడి బావి నీరు కూడా అందటం లేదు, అందుకని వాళ్ల పొలంపొరే మోట బావికి వెళ్లి నీళ్లు తెచ్చుకుని కాచి వడకట్టి తాగుతున్నారు. సుందరమ్మగారు చిటపటలాడుతూనే వున్నారు.

ప్రతి నిత్యం సూర్యోదయానికి పూర్వం, దిక్కులన్నీ మసకచీకటిగా వున్నప్పుడే నిద్రలేవటం మీనాక్షికి అలవాటు, ఆనాడు ఆమెతో పాటే ఇద్దరు కోడళ్ళూ నిద్దర లేచారు, చిన్న కోడలికి ఏం తోచలేదు;

'అక్కా! అప్పుడే పనులు ప్రారంభించడం ఎందుకూ? మేమూ నీకు సాయపడ్తాం, కాని వో మారు ఈ పొలాలూ, కాలువ గట్లూ అన్ని దాటుతూ దూరంగా కనిపిస్తున్న ఆ కొండ దాకా వెళ్లి వద్దాం ప్లీజ్, కాదనకండి' అంటూ పసిపిల్లలా గీమాలింది. పాటకు తాళం వేసినట్లు కాత్యాయని కూడా 'అత్తగారు లేచే వేళకే తిరిగి వత్తాం' అంటూ గోము చూపింది.

మీనాక్షికి కూడా కట్లు తెంచుకుని కొంతసేపు హాయిగా ప్రశాంత వాతావరణంలో తిరిగి రావాలనిపించింది.

ముగ్గురూ నడుస్తూ వుంటే పొలాలగట్ల వెంబడి నీటి తడుపు తడిచిన గడ్డిదుబ్బులు ఏదో కమ్మటి వాసన్ను చిమ్ముతూ వుంటే, ఆలేటి పిట్టలు ముక్కులు బాగా వంచి నీళ్ల గిరి తాగుతున్నాయి. పికిలి పిట్టలు కిచకిచలాడుతున్నాయి. దగ్గర్లో మోట పరుల ఏలపాటలు వినిపిస్తున్నాయి. ప్రకృతి తోడుగా భూమాత లేతసూర్యునికి స్వాగతం పలుకుతూ వుంది. తోటి కోడళ్లు ముగ్గురూ, కలమందచెట్లూ, పాము పడిగె చెట్లూ, కోతులకు విడిది పట్టులైన బండరాళ్లూ, ఊడుగవనం దాటుకుంటూ కొండను సమీపించారు. అక్కడక్కడ జిట్టరేగు పొదలకు పెద్దపెద్ద పగడాల్లా వ్రేలాడుతూ రేగుపళ్లున్నాయి. సరళ పూర్తిగా 'టీనేజర్'లా కేరింతలు కొడ్తూ రేగు పళ్లు తెంపుకుంది. మీనాక్షి అడవిపువ్వొకటి తలలో పెట్టుకోగానే కాత్యయనీ సరళలిద్దరూ జింకపిల్లల్లా పరుగు ప్రారంభించారు; దీంతో వారికి దాహం వేసింది. మరి నీళ్లెలా?

అటూ ఇటూ తిరగడం ప్రారంభించారు, నీటి జాడకోసం. ఇంతలోకే మీనాక్షి 'కాత్యాయనీ! చూడు నీళ్లపై నుండి వచ్చే చల్లదనంతో గాలివీస్తూ వుంది; ఇక్కడే ఎక్కడో? మంచి నీటి గుండం వుండీ వుంటుంది. మీరు వెళ్లి వెతకండి, నేనిక్కడే కాస్సేపు కూర్చుంటాను అంటూ వో చెట్టు కింద బండపై కూర్చుంది.

వాళ్లు వెళ్లిన వో అయిదు నిమిషాలకే 'అక్కా! మీరూ రండి! ఎడమవైపుగా ఎక్కుతూ పెద్ద బండరాయి రాగానే కుడికి తిరగండి తమాషా చూద్దురుగాని!' అంటూ కేకలు వేస్తున్నారు కాత్యాయనీ, సరళలు.

ఆ కేకలు విని వాళ్లు చూచింది నీళ్ల పడిఐ వుంటుంది అని భావిస్తూ బయలుదేరింది మీనాక్షి.

పసికందుగా వున్న సూర్యుడు గులాబీరంగు పులుముకుంటున్నాడు. తోటికోడళ్లిద్దరూ ఆనందంతో చప్పట్లు చరుస్తున్నారు. మీనాక్షి తన కళ్లను తానే నమ్మలేని దృశ్యాన్ని చూచింది. ఆ గుండం కొండచరియ అడుగు భాగంలో వుంది. కొండ చరియకింద

ఎంత దూరం? ఎంతలోతువుందో తెలియదు; కానీ కనపడేది మాత్రం 8-10 అడుగు వుంటుంది. సూర్యకిరణ ప్రసారంతో నీరంతా వజ్రపురాశిలా తళతళలాడుతూ వుం. నీరు నిత్యోపయోగంలో వున్నట్లుంది. ఎక్కడా నాచూగీచూ ఏదీ లేదు. నాలుగువైపులా రాతి కట్టడంలా ప్రకృతి సిద్ధంగానే రాతిమయమై వుంది. మరి ఈ గుండానికి అంతర్వాహిని ఏదో? వుండి వుంటుంది. 'ఇది దివ్యకుండం 'తల్లీ పర్వతేశ్వరీ నీ మహిమ' అంటూ మీనాక్షి చేతులెత్తి నమస్కరించింది. ఇంతల్లో అక్కడ చేదాబొక్కెన కూడా వున్నట్లు సరళ పసికట్టి లాక్కొచ్చింది. బొక్కెనతో నీళ్లు చేదుకుని కాళ్లూ ముఖం కడుక్కుని దాహం తీర్చుకున్నారు. నీళ్లు కోరిన వరుడిలా చల్లగా తియ్యగా వున్నాయి.

ముగ్గురూ ఇంటి ముఖం పట్టారు. గప్‌చుప్‌గా ఎవ్వరి పనులు వాళ్లు చేసుకున్నారు. బావిపూడిక తీయించుమంటూ పెద్దావిడ సుందరమ్మ సూటిపోటి మాటలతో కొడుకులను రాపాడుతూనే వుంది.

బుచ్చినాన్నలు కూడా చిన్న చిన్న చెంబులూ అవీ పట్టుకెళ్లి తమ వంతు నీళ్లు మోస్తూ వుంటే సుందరమ్మగారు స్వర్గద్వారాలు తాకుతూ వుంది.

కొండ దగ్గరి కోనేరు కోతుల ఏలుబడిలోనిది. ఊరి కడ గొట్టు తమ్ముళ్లు తిమ్మన్నలను వంచి కగొల్పి, కో నేటిని స్వాధీనం చేసుకుని దాన్ని కట్టడిగా వుపయోగించుకుంటాన్నారు. ఎవ్వరూ కట్టుదప్పి ఆ నీటిని అపరిశుద్ధం చేయడానికి వీలులేదు, బొక్కెన లేకండా కాలో చెయ్యోముంచితే తిమ్మన్నలు వారిని గులకరాళ్లతో కొట్టి తరిమేస్తాయి. పాడి తప్పి ఒక్క చేరెడు నీళ్లు ఎక్కువ తక్కువగా తీసుకోటానికి వీలులేదు.

నిన్నటి విషయం పసికట్టిన కోతులు కోనేటి కాపరికి ఏదో సంకేతం ఇచ్చినట్లున్నాయి. కాపలాకాడు 'పారాహుషారుగా' దొంగను పడ్తానంటూ చాటుగా మాటుపెట్టి కూర్చున్నాడు. ఇంతలోనే ' ఆడుతూపాడుతూ' గా ముగ్గురు మూడు రాగి బిందెలతో అక్కడికి చేరి, చేదతీసి బావిలో బొక్కెన వేశారు; ఆ బుడ్గు బుడ్గుమనే శబ్దం విని రాతి వెనక వున్న కాపరి చెంగున దుమికి.

'ఎవరమ్మో! బామ్మండ్లోలె కండ్ల వడ్తుండరు? మేం ముట్టుకుంటే మీ బాయి గంగమ్మ తల్లి మైలవడలేదా? ఇవి దాగితె మీరే గాదు తల్లులూ! సచ్చిసొర్గానున్న మీ ఏడు తరాల పెద్దలు నర్కాన బడంగ, ఇన్పమూతి కాకులు పొడ్సుక తినవా? తల్లి! ఏం మొకం బెట్టుకొచ్చిను పుణ్యాత్ములు? ధుత్! వూకెవోండి' అంట అంటుండడు.

ఈ వార్త ఎట్ల అందిందో? ఎట్లేంది, మన కోతులు జాలేసి వుంటాయి. అది ఇన్న ఊరెన్కి వాడంతా కుల పెద్ద ఎంట దండు గదిలినట్లు బయలెల్లి వొచ్చారు.

వచ్చిన గుంపును చూస్తూ మీనాక్షి :

ఏరా నాయినలూ! మేం కాలి నడకన ఇంత దూరం వచ్చి చేదవేసి ఈ గుండాన్ని తాకితేనే అది పవిత్రం కాదట్రా? ఎంత నోము నోచుకున్నారో? అలా, దూరంగా నిలవండి, మేం ఈ మూడు బిందెలూ నింపి పట్టుకెళ్లుతాం; కోతులూ అవీ దగ్గరగా రాకండా చూడండి, పుణ్యం దక్కుతుంది. ఈ నీటితో పెరుమాళ్లకు అభిషేకం అదీ చేస్తాం' అన్నది.

'యాడ వుండడమ్మో పెరుమాళ్లు? పెద్దీర్కాం, నీళ్లు లేక గత్తర గొట్టి సస్తుంటె అంటరానోళ్లు, అడ్కనవడ్డోళ్లు ముట్టుకుంటె మీ దేవుడూ మీరు మైల వడ్తారు? శాపలను రాకినట్లు, మీ ఇగ్రాలను, సింతపండు వెట్టి రాకి రాకి కడ్గుతారు? మరి మీ అసొంటి పచ్చికటికె మణుసులు, పాపాత్ములు తాకితే మా గంగవ్వ తల్లి, ఎల్లవ్వ తల్లి, అంటూ సొంటుంటు అల్గరుగిట్టనా? ఏంది? మాసిన్నోళ్ల దేవుండ్లకు గుడ ఉగ్రం వొస్తది తల్లే!.

ఇంగో, జర ఇను, బాగ రెండు సెవులు దెర్సి ఇను, మీ పెద్దోండ్లోలె మా మనుసులు ఇంగ రాయి వారలేదు, కస్కంత మెత్తన వుండది. పొద్దున లేస్తే మడి ఆశారం అంట మీకు నీళ్లతోటే పనాయె. నీటి జీవులైతిరి. నీళ్లు లేకపోతె మీకూ, మీ దేవుండ్లకు వుపాసమే! అందుకని మీరు బిందెలు వట్క నిలవడుండి, మీకు రెక్కలు నొప్పి గాకుండ తోడిపోస్తం' అన్నడు కులపెద్ద.

'అరె! పోశాలు నీవు నర్కంల వోతవురా! ఏం పాపం జేసినవో యీ పుట్క పుట్టినవ్, ఇంకా మాటలు మీరితే కండ్లు రెండూ పోతాయి. జాగ్రత్త అంటూ హెచ్చరికలు పలికింది మీనాక్షి.

ఏందమ్మో? 'వూకున్న కొద్దికి వూరంతనాది' అన్నట్లు వుర్మంతుడవ్? ఇది నీ యిలాకగాదు; మాది. ఈ బాయి కొండ ద్యావరది; ఆ ద్యావర పూజారోండ్లం మేం; మీ దేవుండ్లకంటె మా దేవుతనే సత్తెం గల్ల తల్లి, అందికే వూళ్ల బావులన్ని ఎండి ఎరగచ్చులై నా గని, మా తల్లి మాహత్తెం తాన, కుడ్తికుండోలె, యాకటి మనిషోలె నిండుగుండది. ఈ నీళ్లను ఏవనుకున్నవ్? టెంకాయ తీర్తం కన్న రుచిగుండయ్! గంగవ్వ తల్లికి 'అంటు సొంటు' అంట గట్టి ఏడేడు జల్మలకు దీరని పాత్కం, ప్యాదోళ్ల అప్పుకంప తీర్గ అంటుగట్టుకోకు'' అంట కాటిపాపని తీర్గ గుత్పసేతవట్టుకోని నిలవడ్డడు.

ఇంతింత ఈ మాట ఆ చెవీ ఈ చెవీ దాటుతూ వూరంతా పాక్కింది. అందరు 'ఆ' అంటే 'అయ్యో! అంటూ గుసగుసలు పోతున్నారు.

పొద్దుటే పొలం వెళ్లి వస్తున్న రాధాకృష్ణ చెవిలో ఏదో స్పష్టాస్పష్టరీతిలో ఈ సంఘటనా విశేషం పడింది. ఆయన వినీవిననట్లు గంభీరంగా తన సహజరీతిలో నడుస్తుకుంటూ కొండవైపువెళ్లాడు.

అక్కడికి చేరిన రాధాకృష్ణశర్మ కంటికి తన తరాల నాటి వంశగౌరవం, ప్రతిష్ఠ, అనువంశికమైన ఆచారం, ఆధిక్యం అంతా తరతరాలుగా కరుగుతూ కొండతల్లి ప్రసన్నతకోసం 'సాకపోసినట్లుగా' కనిపించింది.

ఆ దృశ్యంతో ఒక్కసారి జలదరించి, భావశబలతను చెమట రూపంలో వెళ్లగక్కిన రాధాకృష్ణ మనోబుద్ధి వ్యాపారాలు వివేకాన్ని ఆశ్రయించాయి. ఏ వికారం లేకుండా కంపిస్తూ నిలిచిన భార్యచేతిలో నుండి బిందె తీసుకుని 'పొయ్యరా! నీళ్లు' అన్నాడు.

భయంతో వణకుతూ కింకర్తవ్యతా మూఢుడై నిలిచిన పోశాలును చూస్తూ 'హుం చేది పొయ్యి' అంటూ గద్దించాడు.

చేసేదిలేక పోశాలు నీళ్ల చేదిపోశాడు. సరళా, కాత్యాయని కూడా బిందెలు నింపుకున్నారు.

మీనాక్షి ముందు ఇద్దరు తోటి కోడళ్లు, వారి ముందు నీళ్ల బిందెతో రాధాకృష్ణశర్మ ఇంటికి నడిచివెళ్లారు.

రాధాకృష్ణశర్మ సరళను సంబోధిస్తూ 'సరళా! ఈనాడు స్వామి తళి యారాధన కూ అభిషేకాదులకూ పవిత్ర కార్యాలకూ ఈ నీరే వాడాలి' అంటూ మీ అక్కగారి తో చెప్పు' అంటూ గబగబా నడిచి వెళ్లాడు.

ఆనాడు ఇంట్లో భువనేశ్వరం చాలా అందంగా అలంకరింపబడింది. విగ్రహాలన్నీ ప్రాణప్రతిష్ఠపొందినట్లు శోభాయమానంగా వెలుగుతున్నాయి.

తమ్ములతో సహపట్టుపంచెలు కట్టి నామాలు తీర్చి 'శ్రీచక్రార్చన' అరువాత తీర్థప్రసాదాలు స్వీకరించారు. ముగ్గురు తోటికోడళ్లు మడి చారు పోసిన చీరలు కట్టి అమ్మవారి ప్రసాదంగా పువ్వులు అందుకుని శిగలో తురుముకుని అత్తగారికి పాదాభివందనం చేశారు.

సుందరమ్మగారికి ఇదంతా 'కలయో వైష్ణవ మాయయో?'లా వుంది అయినా ఆనందాన్ని పట్టలేక చిట్టి పొట్టి చిన్నారులను వొళ్లో కూర్చోబెట్టుకుని 'బేజకు దాచి' అంటూ ముద్దుల దొంతరలు గుమ్మరిస్తూ, నడిపి కోడలిని చూచి -

'కాత్యాయనీ! ఎంతకాలానికి నిన్ను ఆపెరుమాళ్లు అనుగ్రహించి ఇంతటి ఆస్తికతను కలిగించాడే? తల్లీ! అంటూ భక్తిగా పోశాలు తోడిపోసిన నీటిని తీర్థంగా స్వీకరించి పరమసుఖభావనతో ధన్యత్వాన్ని భజించింది.

ఉదయాత్పూర్వం కోనేటి గట్టు దగ్గర జరిగిన విషయాన్ని గూర్చి ఎవ్వరూ ఏమీ మాట్లాడలేదు; తల్లి సంతోషంగా కోడళ్లు భయం భయంగా ఎవ్వరి పనుల్లో వాళ్లు నిమగ్నమయ్యారు.

పూజాదులు ముగించిన రాధాకృష్ణశర్మ ధ్యాననిమగ్నుడై గడిపాడు. చివరకు దోష పరిష్కారం దొరికినట్లు స్థిరనిశ్చయం ముఖంపై తాండవిస్తూ వుంటే ఇవతలికి వచ్చి కాత్యాయని వడ్డించగా భోంచేసి వెళ్లిపోయాడు.

కొంతసేపటికి తట్టలూ, పారలూ, గునపాలు, గడ్డపారలతో ఆడా, మగా అంతా బిలబిలమంటూ బావిచుట్టూ చేరారు. కోడళ్లకు అవతలికి తొంగి చూట్టానికి కూడా ధైర్యం చాలలేదు. పిల్లలు 'నానమ్మా!చూద్దువురా! మన బావిచుట్టూ బోలెడు పనివాళ్లు. పెద్దనాన్న కూడా వున్నాలు' అంటూ పెద్దావిడను లాక్కొచ్చారు, ఆమె బావి మరమ్మతు చూచి సంబరపడిపోతూ - 'ఎంతైనా పెద్దవాడు వ్యవహారదక్షుడు; అప్పుడప్పుడు పెళ్లాం మాటకు లొంగి కానీ, లేకపోతే శ్రీరామచంద్రుడిలా నామాట మీర్తాడా? అంటూ ఒక్కసారిగా కౌసల్య కాస్త సత్యభామలా డైలాగ్ కొట్టింది.

బావి పూడిక తీశారు. చుట్టురా గచ్చు చేశారు. అది యిప్పుడు మూడు గిలకల చేదబావి. ఒకవైపు గిలకలేదు; కాని పెద్దగచ్చుగోలెం వుంది.

ఒక గిలక తన ఇంటి వారికి ప్రత్యేకం, అదైనా తన తల్లి సమాధానం కోసం. మిగతా రెండూ వూరి వారందరి వుపయోగార్థం -ఇక్కడ కులం, తలం, ఏ పట్టింపులూ వుండవు. అందరూ నీళ్లు తోడుకోవచ్చు. బావిలో నీళ్లు ఏడులోతులు నిండి పైకి ఐదు మూళ్ల చేదకు అందేట్లుగా వున్నాయి.

ఊరివారంతా కళ్లల్లో ప్రాణాలు పెట్టుకు చూస్తూన్నారు. ఈ నీటికోసం అందని రుచ్యమైన భోజనాన్ని చూచి వుర్విళ్లూరినట్టు.

రాధాకృష్ణశర్మ వాళ్ల ఇంటి దిడ్డి పన్గడి తలుపు తీయించాడు. మంది బార్లు కట్టి నీళ్లు తోడుకుంటున్నారు. బావిపై బొక్కెన వేసిన ప్రతి మనిషీ ఒక బొక్కెడు నీళ్లు తొట్టిలో పోయాలి. తన భార్యతో సహా. అదీ కట్టుబాటు, ఈ నీళ్లు ఆవూరి ఆవులూ, లేగలూ తాగడానికి వుపకరిస్తాయి అంటూ చేసిన నిర్ణయం ఇది.

ఇన్నినాళ్లకు అగ్రహారీకుల బావి తన చుట్టూ గీచుకున్న గిరిని తొలగించుకుని అందరినీ ఆప్యాయంగా ఎదకు హత్తుకున్నది. దీనితో రాధాకృష్ణశర్మ పాటించదలచిన 'స్వాదు ఏకోనభుంజీత' 'త్యాగేనైకేన అమృతత్వ మానశుః' అనే ధర్మం ఆచరణలోకి వచ్చింది.

ఆనాటి సాయంకాలం పోశాలు వచ్చి 'అయ్యా! నన్ను క్షమించండి. మీ పెద్ద మనసు తెల్సుకోలేదు, అన్నాడు. అందుకు రాధాకృష్ణ వాడి వీపు తడ్తూ 'కాదురా! పోచయ్య! నీవే నా కన్ను తెరిపించావు. నిజం! 'నీ ఋణం యిలా నలుగురికి వుపకరించే పని చేసి తీర్చుకున్నాను.' అన్నాడు.

'అయితే మా వూరవుతలి బాయికి జై అంటూ ఆప్యాయతలు పంచుకున్నారు' అందరు కలసి కట్టుగా.